## మురుగు కాలువలకు మోక్షం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్


మురుగు కాలువను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

బీబీపేట్(దోమకొండ), మార్చి 15 : దోమకొండ మండలం చింతమాన్‌పల్లిలో మురుగు కాలువలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కుంటుపడుతున్న పారిశుద్ధ్యం' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్పీవో శ్రీనివాస్ ఆదేశాలు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి పలు వార్డుల్లో మురికి కాలువలను శనివారం శుభ్రం చేయించారు. అధికారులు, నమస్తే తెలంగాణకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి, మార్చి 15 :జిల్లా కేంద్రంలో పోలీస్ సిబ్బందితో ఎస్పీ రాజేశ్ చంద్ర దర్బార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషి చేస్తున్నదని అన్నారు. పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని, బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. వృత్తి నిర్వహణలో నైపుణ్యాలను పెంచుకోవాలని, నిరంతరం విధుల్లో ఉండే సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబ, శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి, సాయుధ దళ డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సాయుధ దళ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట్, మార్చి 15 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి పూర్ణ చంద్రా రావు అన్నారు. మండల కేంద్రంతోపాటు బస్వన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, వసంత సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

### నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో
# రోగులకు తప్పని తిప్పలు

- సమయానికిరాని వైద్యుడు..
- గంటల తరబడి నిరీక్షిస్తున్న రోగులు
- ఇష్టాను సారంగా విధులకు హాజరు
- నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ తీరుపై రోగుల ఆగ్రహం


వైద్యుడు రాక నిరీక్షిస్తున్న రోగులు


రోగులను పరీక్షిస్తున్న స్టాఫ్ నర్సు


వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

నాగిరెడ్డిపేట, మార్చి15 : నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు సృజన్‌కుమార్, సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు వస్తుండడంతో.. రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పీఎచ్‌సీ వైద్యాధికారి సృజన్‌కుమార్ శనివారం విధులకు గైరాజరయ్యారు. తొమ్మిది గంటలకు దవాఖానకు వచ్చిన రోగులు 12 గంటల వరకు నిరీక్షించారు. వైద్యుడు రాకపోవడంతో.. స్టాఫ్ నర్స్ వద్ద పరీక్షలు చేసుకొని మందులు తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎనిమిది పల్లె దవాఖానలు ఉన్నాయి. వైద్యాధికారి సృజన్‌కుమార్ కామారెడ్డి నుంచి విధులకు హాజరవుతున్నారు. స్టాఫ్ నర్సులు, మిగతా సిబ్బంది సైతం ఎల్లారెడ్డి, మెదక్ నుంచి విధులకు హాజరవుతారు. దీంతో పీఎచ్‌సీకి వచ్చినప్పుడే రోగులకు చికిత్సలు అందుతున్నాయి. ఉదయం 9 గంటలకు విధుల్లో ఉండాల్సిన వైద్యుడితో సిబ్బంది 10 గంటల తర్వాత విధులకు హాజరవుతున్నారు. నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎచ్‌సీ రెండు గ్రూపులుగా విడిపోయినట్లు సమాచారం. వైద్యాధికారి సృజన్‌కుమార్‌కు అనుకూలంగా ఒక టీమ్ వ్యతిరేకంగా మరో టీంగా మారి ఇష్టాను సారంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్యాధికారి స్పందించి వైద్యుడు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి సృజన్‌కుమార్‌ను వివరణ కోరగా.. గతంలో ఇక్కడ పని చేసి వెళ్లిన హెల్త్ సూపర్‌వైజర్ సస్యశ్రీ అనారోగ్యంగా ఉండడంతో.. పరామర్శకు వెళ్లినట్లు తెలిపారు.

**పని చేయని సీసీ కెమెరాలు..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండేండ్ల క్రితం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ.. అవి పని చేయడంలేదు. దీంతో సిబ్బందికి కలిసి వచ్చింది. వైద్యాధికారితోపాటు సిబ్బంది ఇష్టాను సారంగా విధులకు వచ్చి వెళ్తున్నారు.

**ఉదయం నుంచి డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న..**

ఆరోగ్యం బాగలేకపోవడంతో డాక్టర్‌కు చూపించుకుందామని ఉదయం 9 గంటలకు దవాఖానకు వచ్చిన. డాక్టర్ రాకపోవడంతో నర్స్ దగ్గర చూపించుకున్న. ప్రైవేట్ దవాఖానకు వెళ్లడానికి డబ్బులు లేక ఇక్కడికి వస్తే.. డాక్టర్ లేడు. జ్వరంతో ఉన్న తమను పట్టించుకొనేవారు లేరు.

– ఒడ్డె మల్లయ్య, తాండూర్ గ్రామస్తుడు



## ఇంటి స్థలం వివాదంపై డీఎల్పీవో విచారణ


బోర్లం క్యాంపులో స్థల వివాదంపై వివరాలు సేకరిస్తున్న డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి

బాన్సువాడ రూరల్, మార్చి 15 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో ఇంటి స్థలం వివాదంపై డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన జంగం చిన్న సాయిలు గ్రామ పంచాయతీ అధికారులు తనకు ఇంటి నంబర్ కేటాయించడం లేదని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డీఎల్‌పీవో గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణతో కలిసి ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు సేకరించారు. ఇంటికి స్థలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. అన్ని ధ్రువపత్రాలు ఉంటే పరిశీలించిన అనంతరం ఇంటి నంబర్ కేటాయిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కారోబార్ వినయ్‌కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

లింగంపేట, మార్చి 15 : వంటశాలలను శుభ్రంగా ఉంచాలని మండల పంచాయతీ అధికారి మలహరి సూచించారు. లింగంపేట మండలం పర్మళ్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంట చేసే పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఉన్నారు.

## నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలి

గాంధారి, మార్చి 15 : నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీరుపోసి సంరక్షించాలని గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల మధ్యలో కలియ తిరిగారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్నదని, మొక్కలు ఎండి పోకుండా నీటిని పట్టాలన్నారు. మొక్కల మధ్యలో కలుపు తీయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జూన్ వరకు నర్సరీలో పెంచుతున్న మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే, పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 15 : జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మొత్తం 38 సెంటర్లలో శనివారం పరీక్షలు నిర్వహించారు. మ్యాథమెటిక్స్, జువాలజి, హిస్టరీ పేపర్–2కు మొత్తం జనరల్ 5,483 మందికిగాను 5384 మంది హాజరుకాగా 99 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 1,284 మందికి 1246 మంది హాజరయ్యారని 38 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

## తలమడ్లలో రైతు పొలంబాట

రాజంపేట్, మార్చి 15 : మండలంలోని తలమడ్ల గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ పొదుపు, కెపాసిటర్లు అమర్చడంతో కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఈఈ కళ్యాణ్ చక్రవర్తి, రాజంపేట ఏఈఈ నాందేవ్, తలమడ్ల లైన్‌మన్ బ్రహ్మం, విద్యుత్ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## షీటీమ్, సైబర్ నేరాలపై అవగాహన

బీబీపేట, మార్చి 15 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్, సైబర్ నేరాలపై శనివారం పోలీస్ కళాబృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్‌రెడ్డి, పోలీస్ కళాబృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వాడిలో ఇసుక వేలం

మాచారెడ్డి, మార్చి 15 : పాల్వంచ మండలంలోని వాడి గ్రామంలో రెండు రోజుల క్రితం సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ లక్ష్మణ్ శనివారం వేలం నిర్వహించారు. సీజ్ చేసిన 15 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను రూ.28,500కు గ్రామానికి చెందిన నర్సారెడ్డి వేలంలో దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**21న తైబజార్‌కు..**

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను ఎల్లారెడ్డి తైబజార్ వేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు వారసంత, రోజువారీ సంత, పశువుల సంతలకు సంబంధించిన వేలం పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వారసంతకు రూ.లక్ష, రోజువారీ సంతకు రూ.75వేలు, పశువుల సంతకు రూ.50వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తైబజార్ కాల పరిమితి ఏడాది పాటు ఉంటుందన్నారు.

## ప్లాస్టిక్‌గన్‌తో కోతులు పరార్

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : పట్టణంలో కోతుల నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో వాటి నుంచి ఉపశమనం పొందడానికి ఓ మహిళ కోతులను భయపెట్టించే గన్ అమ్మకాలను ప్రారంభించింది. మహారాష్ట్ర ఉమ్మర్‌ఖేడ్ నుంచి వచ్చిన రత్నాజాదవ్ అనే మహిళ పెద్దగా బాంబులు కాల్చినట్లుగా సౌండ్ వచ్చే ప్లాస్టిక్ గన్‌ను తీసుకువచ్చి ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో అమ్మకం చేపట్టింది. గన్ తయారీకి తనకు వంద రూపాయల వరకు ఖర్చు అవుతుందని, గన్‌తో పాటు దాంట్లో వేయడానికి కార్బైడ్ ప్యాకెట్‌ను ఇస్తున్నట్లు ఆమె తెలిపింది. ఒక గన్‌ను విక్రయిస్తే రూ.50 వరకు మిగులుతాయని ఆమె తెలిపింది.

## బీబీపేటలో కాన్షీరాం జయంతి


తుజాల్‌పూర్‌లో కాన్షీరాం చిత్రపటానికిత పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

బీబీపేట, మార్చి 15 : మండల కేంద్రంతోపాటు తుజాల్‌పూర్, శేరీ బీబీపేట, మాందాపూర్ తదితర గ్రామాల్లో కాన్షీరాం జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : త్వరలోనే ధాన్యం కొనగులో కేంద్రాలను ఏర్పాటు చేస్తామని సొసైటీ చైర్మన్ నర్సింహులు అన్నారు. ఎల్లారెడ్డిలోని సొసైటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఉన్నారు.

## పీహెచ్‌సీ సందర్శన

భిక్కనూరు, మార్చి 15 : భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుకిరణ్ శనివారం సందర్శించారు. దవాఖానలోని ల్యాబ్, ఫార్మసీ, పేషెంట్లు ఉన్న గదులకు వెళ్లి పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులను ఆదుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : అద్దాల మేడలు కట్టినా బతుకులు మారడం లేదని, కార్మికులను ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వందశాతం సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక రంగ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో భవన నిర్మాణ కార్మికరంగ సంఘ సభ్యత్వాన్ని శనివారం చేపట్టారు. నిజమైన కార్మికులు తప్పకుండా సభ్యత్వం, లేబర్‌కార్డులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవదాస్, విజయరావు, సాయిలు, దేవ య్య, బాబు, శ్రీధర్ నారాయణ తదితరులున్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, మార్చి 15 : మండలంలోని వదలపర్తి గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో ప్రభాకర్ శనివారం పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 1066 మంది కూలీలతో భూ అభివృద్ధి, ఫార్మేషన్ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు.


వదలపర్తిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్

# విద్యార్థుల కోసం ఏఐ బోధన

నిజాంసాగర్, మార్చి 15 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుకోసం ప్రభుత్వం ఏఐ బోధన అమలు చేస్తున్నదని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. నిజాం సాగర్ మండలంలోని అచ్చంపేటలోని ఉన్నత పాఠశాలలో కృత్రిమ మేధా(ఏఐ) పాఠాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాయం తీసుకుంటున్నదని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలానికి ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో రెండు రోజుల క్రితం ప్రారంభించిన చలివేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, డీఈ గోపాల్, డీఈవో రాజు, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల ఎంఈవోలు తిరుమలరెడ్డి, అమర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**కంప్యూటర్ విద్యతో విద్యార్థుల మేథాశక్తి పెంపు**

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : కంప్యూటర్ విద్యతో ఎఫ్ఎల్ఎన్ స్లో లెర్నర్ విద్యార్థుల మేథాశక్తి పెరుగుతుందని డీఈవో రాజు అన్నారు. మండలంలోని కళ్యాణి గ్రామ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాశాలలో కంప్యూటర్ ఆధారిత విద్యను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ ఆధారిత విద్యకు సంబంధించి మండలంలో కళ్యాణి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, సెక్టర్ ఆఫీసర్ వేణుశర్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సంగ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శెట్పల్లి గ్రామంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం**

లింగంపేట, మార్చి 15 : ప్రాథమిక స్థాయిలోనే కంప్యూటర్ విద్యపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈవో శౌకత్ అలీ సూచించారు. లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుధ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ అఖిల్, ఉపాధ్యాయులు రవి, ప్రదీప్, రాములు, హరికిషన్, సర్దార్, మంగమ్మ, ప్రవీణ్, అశోక్, సంతోశ్, రాజేశ్‌తో పాటు సీఆర్‌పీ రాజు ఉన్నారు.

**రామారెడ్డిలో..**

రామారెడ్డి, మార్చి 15 : రామారెడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను స్థానిక విద్యాధికారి ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అచ్చంపేటలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


శెట్పల్లిలో మండల విద్యాశాఖ అధికారి..


రామారెడ్డిలో ఎంఈవో..

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

లింగంపేట, మార్చి 15: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. లింగంపేట మండలంలోని లింగంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో నిలువ ఉన్న సరుకులు, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. మొక్కలకు ఎప్పటికప్పుడూ నీటిని అందిస్తూ సంరక్షించాలని సూచించారు. ఎంపీడీవో వెంట అంగన్‌వాడీ టీచర్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

లింగంపేట(తాడ్వాయి), మార్చి 15 : తాడ్వాయి మండలం సంగోజీవాడి గ్రామంలో స్థానిక నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శివాజీ, లింగం, మహమూద్, బాల్‌రాజ్, హనీఫ్, రవి, దస్తగిరి, షాబోద్దీన్, రాజు, చిన్న రాజు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోస్తే పనులను ఎంపీడీవో ప్రకాశ్ శనివారం పరిశీలించారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి రాజయ్య తదితరులున్నారు.

## స.హ.చట్టం మండల కార్యదర్శిగా రవి


నియామకపత్రాన్ని స్వీకరిస్తున్న నీల రవి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: ఎల్లారెడ్డి మండల సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ కార్యదర్శిగా నీల రవిని ఎంపిక చేశారు. శనివారం స.హ. చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మహ్మద్ సలీం చేతుల మీదుగా మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన నీల రవికి అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి కమిటీ మండల కార్యదర్శిగా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా సలహాదారులు మదర్‌పాషా, మోహన్‌రెడ్డి, సయ్యద్ యూసుఫ్ తదితరులున్నారు.

## వసతి గృహాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్, మార్చి 15 : మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను సబ్‌కలెక్టర్ కిరణ్మయి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వసతి, ఇతర సౌకర్యాల గురిం చి తెలుసుకున్నారు. విద్యార్థుల బెడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్లకు సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. తహసీల్దార్ ముజీబ్, మండల విద్యాధికారి రాములు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నాగిరెడ్డిపేట, మార్చి 15 : మండలంలోని తాండూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు శనివారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంజూరు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాండూర్ విండో అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు సంజీవులు, సంగయ్య, కిష్టయ్య, హన్మంత్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో పడి యువకుడి గల్లంతు

బాన్సువాడ రూరల్, మార్చి 15 : బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండా శివారులో శనివారం ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి సిద్దూ (19) గల్లంతయ్యాడు. మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్రాం నాయక్ తండాకు చెందిన సిద్దూ నిజాంసాగర్ కాలువ ఒడ్డున నిలబడి కాళ్లు, చేతులు కడుక్కునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన సిత్తరి బాలకృష్ణ (28) పాత ఇనుపసామన్ల వ్యాపారం చేస్తూ జీవించేవాడు. వ్యాపారానికి సంబంధించి అప్పులు చేశాడు. అప్పులు చెల్లించలేక జీవితంపై విరక్తి చెందిన బాలకృష్ణ తిమ్మారెడ్డి శివారులోని రామలింగం బావి వద్ద వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి కాశీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

రామారెడ్డి, మార్చి 15 : ఫైనాన్స్‌వాళ్ల వేధింపులు తాళలేక చిదుర విఠల్ గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలో మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన చిదుర విఠల్, భార్య నాగరాణి పేరుమీద ఉన్న ఇంటిపై హౌసింగ్‌లోన్ తీసుకున్నాడు. హౌసింగ్ లోన్ వారు పెండింగ్ ఇన్‌స్టాల్‌మెంట్ కోసం పలుమార్లు ఇంటికి వచ్చివెళ్లారు. చివరకు ఇంటిని వేలం వేస్తామని చుట్టుపక్కల వారికి తెలుపడంతో మనస్తాపం చెంది అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని దవాఖానలో గుండె పోటుతో శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

## గోశాలకు జీవాలు తరలింపు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15 : బర్రెలతో వెళ్తున్న రెండు డీసీఎం వ్యాన్లను బజరంగ్‌దళ్ కార్యకర్తలు శనివారం పట్టుకొని బిచ్కుంద గోశాలకు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పక్కా సమాచారం మేరకు సాటాపూర్ నుంచి హైదరాబాద్‌కు అనుమతికి మించిన బర్రెలను తరలిస్తున్న రెండు వ్యాన్లను బజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టుకొని ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు రెండు డీసీఎంలను బిచ్కుంద గోశాలకు తరలించారు.